
TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 199 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శుక్రవారం.13.02.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




# నేనెవరితో పోల్చుకోను : : సీఎం రేవంత్‌రెడ్డి



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: ”రాజకీయాల్లో అయినా.. వ్యక్తిత్వంలో అయినా... నేనే రాజు... నేనే మంత్రి. నేనెవరితో పోల్చుకోను” అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తాను మోడీ, కేసీఆర్‌లాగా వ్యవహరించననీ, రాజ్యాంగాన్ని నమ్మి పని చేస్తానని చెప్పారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం గురువారం తన అధికారిక నివాసం తుగ్లక్‌రోడ్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై కేంద్రమంత్రుల్ని కలిసి విజ్ఞప్తులు చేసినట్టు చెప్పారు. అలాగే తాజా మున్సిపల్ ఎన్నికల తీరు, ఇతర అంశాలపై పార్టీ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌లకు రిపోర్ట్ అందజేసినట్టు చెప్పారు.

పది సార్లు కేంద్ర మంత్రుల్ని కలవడం వల్ల.... కనీసం ఒక్క అంశం అయినా పరిష్కారం అవుతుందన్నారు. త్రిపుల్ ఆర్ ఉత్తర భాగానికి నెంబర్, రాష్ట్రానికి మూడు బుల్లెట్ ట్రైన్లు వచ్చాయని తెలిపారు. అలాగే మామునూరు, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు అనుమతులు దక్కాయని చెప్పారు. వరంగల్ ఎయిర్ పోర్ట్ భూసేకరణ పూర్తి అయిందని, ఆదిలాబాద్ భూసేకరణ త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. ఈ జూన్ 2కు ఈ రెండు ఎయిర్‌పోర్ట్‌ల పనులు ప్రారంభించి,రెండేండ్లలో ఎయిర్‌పోర్ట్‌లు సేవలోకి వచ్చేలా టార్గెట్‌తో పని చేయనున్నట్టు తెలిపారు.

కిషన్ రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలి...

”కాళేశ్వరంపై విచారణ చేపట్టాలని సీబీఐ డెరెక్టర్‌కు లేఖ రాశాం. అదే కాపీని హోం సెక్రెటరీకి జత చేశాం. అయితే కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో కేసీఆర్‌ను అరెస్ట్ చేస్తామని కిషన్‌రెడ్డి అఫిషియల్‌గా చెప్పారు. ఇంతకాలమైనా ఎందుకు కేసీఆర్‌ను అరెస్ట్ చేయడం లేదో ఆయన చెప్పాలి. రాష్ట్ర లేఖపై సీబీఐ, డీఓపీటీకి రెఫర్ చేస్తుంది. డీఓపీటీ పీఎంఓకు సూచిస్తుంది. అయితే... మరి ఫైల్ పీఎంఓలో ఆగిందో, ఎక్కడ ఆగిందో క్యాబినెట్ మంత్రిగా కిషన్‌రెడ్డి, హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ సమాధానం చెప్పాలి” అని సీఎం అన్నారు. అలాగే ఈ-ఫార్ములా రేసులో ఐఏఎస్ అధికారిని విచారించేందుకు డీఓపీటీ అనుమతి ఇవ్వడం లేదని తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ ఏ1 గా ఉన్న ఎస్ఐబీ మాజీ అధికారి ప్రభాకర్ రావును భారత్‌కు తీసుకువచ్చేందుకు కేంద్రం సహకరించలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో 20 నెలలు కొట్లాడి... ప్రభాకర్ రావును తీసుకువచ్చి విచారణ కొనసాగిస్తుందన్నారు. ఒక కౌన్సిలర్ కోసం, మనిషిని చంపే ఆలోచన కాంగ్రెస్ పార్టీది కాదన్నారు. కేవలం సింపతి, సెంటిమెంట్ కోసం బీజేపీ ఈ ఆత్మహత్యను వాడుకుందని చెప్పారు. కిషన్ రెడ్డికి లోకల్ పోలీసులపై నమ్మకం లేకపోతే... విద్యుత్ కమిషన్‌తో పాటు ఫోన్ ట్యాపింగ్, కొడంగల్‌లో బీజేపి కౌన్సిల్ అభ్యర్థి ఆత్మహత్య కేసును సీబీఐకి అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

కాళేశ్వరం కూల్చి నా ఖాతాలో వేయాలనుకుంటున్నారు...

కాళేశ్వరం విషయంలో తాను కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కేఆర్ సురేశ్ రెడ్డి మాదిరిగా తాను మేధావిని కాదని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అందుకే ఈ ప్రాజెక్ట్ మూడు నెలలకే కుప్పకూలిందన్నారు. ”నేను సామాన్యుడిని. అందుకే నిపుణుల సలహాలు తీసుకుంటున్నాం. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) సూచించిన విధంగా కాళేశ్వరం డ్యామేజీ విశ్లేషణకు నేషనల్ ఏజెన్సీకి అప్పగించాను. ఈ విషయంలో సాంకేతిక నిపుణులు ఒకటి చెప్తే... బీఆర్ఎస్ నేతలు మరోటి అంటున్నారు.

వాళ్లు ఆరోపించినట్టు బాంబులు పెడితే విస్ఫోటనం జరగాలి కానీ... పిల్లర్లు కుంగుతాయా? కుంగిన మేడిగడ్డ కాళేశ్వరానికి గుండెకాయ. ఆ కుంగిన ఈ బ్యారేజీలో నీళ్లు నింపేలా ఒత్తిడి చేసి... ఆ కూలిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నా ఖాతాలో వేయాలనుకుంటున్నారు. కాంగ్రెస్ కాళేశ్వరం కూల్చిందని చెప్పాలనుకుంటున్నరు. వాళ్ల శాపనార్థాలు, కోరికల ప్రకారం నేను నడుచుకోను” అని అన్నారు. కవిత కొత్త పార్టీ గురించి చెప్పేందుకు ఏమీ లేదని తెలిపారు. ప్రజలు ఏమైనా ఆలోచించినప్పుడు చెప్తానన్నారు. వాస్తవానికి కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవితలు ఒక్కటే అని వ్యాఖ్యానించారు.

వాళ్లను జైలుకు పంపేందుకే అధికారులను నియమించాం

కాళేశ్వరం, ఈ-ఫార్ములా, ఇతర కేసులలో కేంద్రం.. కేసీఆర్‌ను అరెస్ట్ చేయడం లేదని విమర్శించారు. తాను మోడీ , కేసీఆర్‌ను కాదని... సిస్టం ఫాలో అవుతానని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తప్పు చేసిన వాళ్లను(కేసీఆర్, కేటీఆర్, ఇతరులు) జైలుకు పంపేందుకే సిట్ పేరుతో అధికారులను నియమించినట్టు చెప్పారు. ఎస్ఐబీ ఆఫీసులో మిస్సింగ్ అయిన వస్తువులతో పంజాగుట్టలో దాఖలైన మిస్సింగ్ కేసు... ఫైనల్ గా ఫోన్ ట్యాపింగ్‌గా మారిందన్నారు. సైజ్ ఆఫ్ క్రైంను బట్టి అధికారులను నియమిస్తారని చెప్పారు. ఈ కేసు ఫైల్ అయిన ఏరియాకు సజ్జనార్ కమిషనర్ కాబట్టి... సిట్‌కు అధికారిగా ఉన్నారన్నారు. ”ఈ కేసును రాష్ట్ర హైకోర్టు సుమోటోగా పర్యవేక్షిస్తోంది. సిట్ వేయాలన్నారు. ప్రభుత్వం వేసింది. పోలీసులు డేటా ఆధారంగా విచారణ చేస్తున్నరు.

ఈ కేసు విచారణ నాకేం తెలీదు. నేను తెలుసుకోవాలనకోవడం లేదు. అందుకే నాకు అధికారులు బ్రీఫ్ చేయడం లేదు. వాళ్లకు స్వేచ్ఛ ఇచ్చా. సేకరించిన డేటాను అధికారులు కోర్టులో ప్రొడ్యూస్ చేస్తారు” అని సీఎం చెప్పారు. ”బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నట్టుగా నేనే జోక్యం చేసుకుంటే... ఎవరూ బయట ఉండరు” అని హెచ్చరించారు. అయితే సీఎం కాబట్టి ఏది జరిగినా తన ఖాతాలోకే వస్తుందన్నారు. కానీ తాను ”దుష్ట శిక్షణ-శిష్ట రక్షణ” చేస్తున్నట్టు చెప్పారు. ఫోన్ ట్యాపింగ్స్ వింటే మానసిక క్షోభ కలుగుతుందనీ, మన:శ్శాంతి ఉండదన్నారు. కేసీఆర్‌ను ఎవరూ హౌజ్ అరెస్ట్ చేయలేదనీ, ఆయనే స్వీయ నిర్బంధంలోకి వెళ్లారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు.


# 2029లో జమిలి ఎన్నికలు: సీఎం రేవంత్




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అలాగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు కూడా అప్పుడే ఉండనున్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు బుల్లెట్ రైలు వచ్చిందని తెలిపారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు ఫ్యూచర్ సిటీకి 500-700 ఎకరాలు ఇవ్వనున్నట్టు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

“ఎన్టీఆర్ జాతీయ నాయకుడు.. ఆయకు భారతరత్న ఇవ్వలి.. అమీర్‌పేటలో ఆయన విగ్రహం పెట్టి తీరుతాం అని సీఎం అన్నారు. నూటికి నూరు శాతం మా ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ లేదు. నాలుగు గోడల మధ్య జరిగే వ్యవహారం నాకు అవసరం లేదు. ఎస్ఐబీ ఫిర్యాదుతోనే ఆ కేసు దర్యాప్తు జరుగుతోంది. కిషన్‌రెడ్డి లేఖ రాస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు కూడా సీబీఐకి ఇస్తాం. నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. 2018లో తెచ్చిన నిబంధనల మేరకే సింగరేణిలో టెండర్లు. సింగరేణి టెండర్లపై ప్రతి డాక్యుమెంట్‌ను అసెంబ్లీలో పెడతాం. ఆరోపణలు తప్పని తేలితే కిషన్‌రెడ్డి క్షమాపణలు చెబుతారా? సింగరేణికి కేసీఆర్ పెట్టిన బకాయిలే ఎక్కువ. సింగరేణి విషయంలో కేసీఆర్‌ను కిషన్‌రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదు. ఆయన నన్ను మాత్రమే ఎందుకు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్‌కు రాజకీయ ప్రత్యర్థులే తప్ప.. శత్రువులు లేరు. కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ లేఖ రాసి 6 నెలలు అయ్యింది. దీనిపై కేంద్రం ఇంతవరకు ఎందుకు నిర్ణయం తీసుకోలేదు. విద్యుత్ కొనుగోలు వ్యవహారం కేసును త్వరలోనే సీబీఐకి ఇస్తాం” అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# నేడు మున్సిపోల్స్ కౌంటింగ్




హైదరాబాద్ అమృత్ తెలంగాణ:రాష్ట్రవ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లోని 2,996 వార్డుల ఓట్ల లెక్కింపుకు ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానున్న లెక్కింపు కోసం 123 కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపు 10 వేల మంది సిబ్బంది లెక్కింపులో పాల్గొంటారు. మున్సిపాల్టీ, కార్పొరేషన్లలోని వార్డుల సంఖ్య ఆధారంగా 15 నుంచి 35 వరకు టేబుళ్లను ఏర్పాటు చేశారు. ప్రతి టేబుల్‌పై జరుగుతున్న లెక్కింపు ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి మానిటరింగ్ చేయనున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. పోటీలో ఉన్న రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్‌లను తెరుస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల వారీగా 25 చొప్పున బెండల్స్ కడతారు. అనంతరం వాటిని లెక్కిస్తారు. తొలి ఫలితం మధ్యాహ్నం 12 గంటల వరకు వస్తుందని భావిస్తున్నారు.

పరోక్ష ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ప్రకారం మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికకు గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఫిబ్రవరి 16న సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం అదే రోజు ఎన్నిక నిర్వహిస్తామని పేర్కొంది. ఏదైనా కారణం చేత ఎన్నిక వీలు కాకుంటే మరుసటి రోజు ఫిబ్రవరి 17న నిర్వహించనున్నామని తెలిపింది. నేరుగా ఎన్నికైన సభ్యులతో పాటు ఎక్స్ అఫిషియో మెంబర్లైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎన్నుకోనున్నారని పేర్కొంది. ఎన్నిక జరిగే ప్రాంతంలో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ, వాల్ క్లాక్, పార్టీల వారీగా సీట్ల ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ శాఖను ఆదేశించింది.

# కేసీఆర్ న్యాయం చేయలే




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: పదేండ్లు ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చినప్పటికీ ఉద్యమకారులకు కేసీఆర్ న్యాయం చేయలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. రాష్ట్ర ప్రజలను బీఆర్ఎస్ విస్మరించిందంటూ తాను న్యాయం చేస్తానంటూ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులను ఆదుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు పదేపదే మాట్లాడిన ప్రొఫెసర్ కోదండరాం, ఆకునూరి మురళి లాంటి వారు మౌనంగా ఎందుకుంటున్నారు? అని ఆమె ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఉద్యమకారుల కోసం మరో ఉద్యమం చేయబోతున్నట్టు ఆమె ప్రకటించారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను మొదలు పెడుతున్నట్టు అసెంబ్లీలో ప్రకటించాలనీ, వారికిచ్చిన హామీలు రూ.25 వేల పెన్షన్, 250 గజాల స్థలం, అమరవీరుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు వంటివి అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

ఈ డిమాండ్ల సాధన కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతామని ఆమె హెచ్చరించారు. గురువారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో ఆమె మాట్లాడారు. రాంజీగోండు మొదలు కొమురం భీం వంటి వారు నిజాం సర్కారుకు, రజాకార్లకు వ్యతిరేకంగా తిరుగుబాటు, నాటి భారత సైన్యం అణచివేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు, ముల్కీ రూల్స్, 1995లో జనశక్తి ఆధ్వర్యంలో వరంగల్ డిక్లరేషన్, మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు నిత్యం పోరాటాలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. 2014లో బీఆర్ఎస్ (నాడు టీఆర్ఎస్) అధికారంలోకి వచ్చాక కూడా ఉద్యమకారులకు న్యాయం జరగలేదన్నారు. పైగా తెలంగాణ వ్యతిరేకులకు, సమైఖ్యవాదులకు పెద్దపీట వేశారని ఆమె ఆరోపించారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలేమీలేదంటూ.. తాము చేస్తామని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటి అమలును నిర్లక్ష్యం చేస్తున్నదని కవిత విమర్శించారు.

తెలంగాణకు స్వీయ రాజకీయ అస్థిత్వం ఉన్న పార్టీ అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ పేరులోనూ, ఆశయంలోనూ, ఆచరణలోనూ ఉంటుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి సహకరించిన చిన్న కాంట్రాక్టర్లు, బడ్జెట్ స్కూళ్ల యజమానులు, చిన్న ప్రింటింగ్ ప్రెస్‌లు, పాత్రికేయులు, రచయితలు, కళాకారులను గుర్తించి గౌరవించుకోవాల్సిన అవసరముందని అభిప్రాయ పడ్డారు. ఉద్యమకారుల ఆకాంక్షలు పట్టించుకోకనే కేసీఆర్ అధికారం కోల్పోయారనీ, అదే పని చేస్తే రేవంత్‌రెడ్డిని కూడా ప్రజలు గద్దె దింపుతారని హెచ్చరించారు.

# గురుకులాల్లో పురుగుల్లేని భోజనం అందించండి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: గురుకులాల్లోని విద్యార్థులకు పురుగుల్లేని భోజనం అందించాలని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. గురుకులాలు, ఓయూ విద్యార్థుల నిరసనలపై హరీశ్‌రావు గురువారం ఎక్స్ ద్వారా ట్వీట్ చేశారు. కల్తీ ఆహారం వదంటూ సంగారెడ్డి జిల్లా నారాయణ్ ఖేడ్ మండలం ఎస్టీ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రోడ్డెక్కారని గుర్తు చేశారు. భోజనం బాగుండటం లేదని ఓయూలో విద్యార్థులు నిరసన తెలిపారని వివరించారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో ప్రతిరోజూ ఎక్కడో ఓ చోట జరుగుతున్నా విద్యాశాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉలుకు లేదు, పలుకు లేదని విమర్శించారు. నిత్యం గాలి మోటార్లలో చక్కర్లు కొట్టే సీఎంకు గురుకులాల్లో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులపై సమీక్షించే తీరిక లేకపోవడం సిగ్గుచేటని తెలిపారు.

# జర్నలిస్టులకు 44 వేల అక్రిడిటేషన్లు

హైదరాబాద్ : రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని గుర్తు చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సీపీఆర్‌వో జి. మల్సూర్‌తో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జీవో 252 జారీ చేసినట్టు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోన్న తర్వాత సవరణలు జీవో 103ను జారీ చేసినట్టు వెల్లడించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా ఇసుక కు డబ్బులు ఇవ్వాలని బెదిరించిన ముగ్గురు విలేకరులపై కేసు నమోదు చేసిన జన్నారం పోలీసులు...

నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం, ఫిబ్రవరి 12, ( అమృత్ తెలంగాణ ) జన్నారం:- జన్నారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన సునావత్ విజేష్ ఇందిరమ్మ ఇల్లు సొంత ఇంటి నిర్మాణానికి ఇసుక తరలిస్తే డబ్బులు ఇవ్వాలని తుడుం జితేందర్ జనం పవర్ పత్రికా విలేఖరి కవ్వాల్ గ్రామం, అంబటి శరత్ పోరు తెలంగాణ పత్రిక విలేఖరి కవ్వాల్ గ్రామం, దాసంగ్ల నవీన్ ఎక్స్ ప్రెస్ పత్రిక విలేకరి కొత్తపేట్ గ్రామం, లకు చెందిన ముగ్గురు విలేకరులు బెదిరించారని, గురువారం జన్నారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారు కథనం ప్రకారం గత 15 రోజుల నుండి అంబటి శరత్, తుడుం జితేందర్, జనం పవర్, దాసండ్ల నవీన్ ముగ్గురు పత్రిక విలేఖరులు, కొత్తపేట్ గ్రామం అనువారు తాను కొత్తపేట వాగు నుండి తన ఇంటి నిర్మాణం గురించి ఇసుక తీసుకొని వెళ్ళినప్పుడు ఫోటోలు తీస్తూ వారికి ఒక్కక్కరికి నెలకు 5, వేల రూపాయలు ఇవ్వాలని లేదా ఫారెస్ట్ వారికి పట్టిస్తామని, పత్రికల్లో రాస్తామని బెదిరిస్తూ విజేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అందాజ ఉదయం 9 గంటల సమయంలో, విజేష్ ట్రాక్టర్ లో ఇసుక నింపుకొని వస్తుండగా, తుడుం జితేందర్, అంబటి శరత్, దాసండ్ల నవీన్ పత్రిక వేలేఖరులు అతనిని కొత్తపేట గ్రామ శివారులో అడ్డగించి, అడిగిన డబ్బులు ఇస్తావా లేదా విజేష్ ట్రాక్టర్ తీసుకొని వెళ్ళి ఫారెస్ట్ వారికి అప్పగిస్తామని భయభ్రాంతులకు గురి చేశారు. విజేష్ ఎలా బ్రతకాలో ఆలోచించుకో అని బెదిరించినారని ఆ విషయమై జన్నారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారు ఫిర్యాదు సమాచార విషయమై



జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష,

తుడుం జితేందర్ జనం పవర్, అంబటి శరత్ పోరు తెలంగాణ, దాసండ్ల నవీన్ చార్మినార్ ఎక్స్ ప్రెస్ పత్రికల విలేఖరులపై ముగ్గురి పైన కేసు నమోదు చేసినట్లు జన్నారం ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపారు.

## సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్....





అధికారులతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ జిల్లా ఫిబ్రవరి 12 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లాలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 20న ఖానాపూర్‌లో జరగనున్న జయంతి కార్యక్రమాల నిర్వహణపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖానాపూర్ పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమాలకు హాజరయ్యే ప్రజలను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, పారిశుధ్యం తదితర వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ప్రాంగణంలో అంబులెన్స్‌తో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని భావించి తగిన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. భద్రతా దృష్ట్యా అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్న కళ్యాణి, డి టి డి ఓ అంబాజీ, ఇతర అధికారులు, ఉత్సవ సమితి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రామారావు పటేల్





బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ జిల్లా కుభీర్ ఫిబ్రవరి 12 అమృత్ తెలంగాణ కుబీర్ మండలం రామ్ నాయక్ తండాకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ మరియు తాజా మాజీ సర్పంచ్ రాథోడ్ శంకర్ కోడలు రాథోడ్ వనిత, విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. అలాగే చాత గ్రామానికి చెందిన సింధే అభాన్ రావ్ పటేల్, అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషాద సంఘటనలపై స్పందించిన ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్, మృతుల కుటుంబాలను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పి, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

## మహిళల ఆరోగ్యం, పరిశుభ్రత, సాధికారత లక్ష్యంగా 'ప్రగతి' కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి మహిళల ఆరోగ్యం, పరిశుభ్రత, సాధికారత లక్ష్యంగా 'ప్రగతి' కార్యక్రమాన్ని గురువారం జైనథ్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ (TGMS) జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. దేశంలోని ప్రముఖ టెలికాం మౌలిక వసతుల సంస్థ ఇండస్ టవర్స్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా, పింకిషే ఫౌండేషన్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లా కలెక్టర్ రాజర్షి షా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యం, విద్యపై పెట్టే పెట్టుబడి సమాజ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందన్నారు. రుతుక్రమంపై ఉన్న అపోహలను తొలగించి కిశోర బాలికలు, మహిళల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు అవసరమని పేర్కొన్నారు. 'ప్రగతి' కార్యక్రమాన్ని జిల్లాలో నిబద్ధతతో అమలు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుపై దృష్టి సారించి ఐఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో అవకాశాలు సాధించాలని సూచించారు ఇండస్ టవర్స్ ప్రతినిధి అరుణ్ మాట్లాడుతూ, మహిళల ఆరోగ్య పరిరక్షణకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంచడం ద్వారా మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. అనంతరం మోడల్ స్కూల్ కు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించి, ఈ సందర్భంగా అధికారులను కలెక్టర్ అభినందిస్తూ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, సంతోష్ రామ్, సీసీఈఓ అరుణ్, పింకిషే ఫౌండేషన్ ప్రతినిధులు శాతిని గుప్తా, అరుణ్ గుప్తా, జైనథ్ సర్పంచ్ మమత, ప్రత్యూష, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





హాజరైన విద్యార్థిని విద్యార్థులు

## మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్







నిర్మల్ జిల్లా కేంద్రంలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

నిర్మల్ జిల్లా ఫిబ్రవరి 12 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొననున్న సిబ్బందికి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల వారీగా కౌంటింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించనున్న సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. సమయపాలన అత్యంత ముఖ్యమని, సిబ్బంది నిర్ణీత సమయానికి కౌంటింగ్ కేంద్రాలకు హాజరుకావాలని ఆదేశించారు. అన్ని నియమాలను తూచా తప్పకుండా పాటిస్తూ, పారదర్శకంగా వేగవంతంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు వీరారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో పోలింగ్ విజయవంతంగా నిర్వహించినందుకు సిబ్బందిని అభినందించారు. అదే క్రమశిక్షణతో ఓట్ల లెక్కింపును కూడా పూర్తి చేయాలని పేర్కొన్నారు. సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. అనంతరం కౌంటింగ్ హాలుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,కిషోర్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బోథ్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ లో చేరికలు

### గుడిహత్నూర్ మండలం (సోపాన్) ముత్నూర్ BRS, BJP పార్టీ ల నుండి భారీ సంఖ్యలో చేరిక అభివృద్ధితో కలిసి నడుస్తాం అన్న గ్రామస్తులు

అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ గుడిహత్నూర్ మండలం ముత్నూర్ గ్రామం నుండి, జై భీం సమాజ అధ్యక్షులు మొగ్డే గంగాధర్, వాగ్మరే రఘునాథ్, మహిళా అధ్యక్షులు అనురాధ వాగ్మరే,ఉపాధ్యక్షులు చరణ్ గులవీ, యూత్ అధ్యక్షులు అభిషేక్,ఉపాధ్యక్షులు నక్క రాజు తో పాటు పలువురు ప్రముఖులు, పెద్దలు , మహిళలు, యువకులు నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ సమక్షంలో భారీ సంఖ్యలో చేరారు. చేరిన వారు మాట్లాడుతూ, ఆడే గజేందర్ గారు నియోజకవర్గానికి చేస్తున్న సేవలు, కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి చూసి తమ గ్రామ భవిషత్తు కోసం పార్టీలో చేరుతున్నామన్నారు .అనంతరం

ఆడే గజేందర్ మాట్లాడుతూ గ్రామస్తుల అభ్యర్థన మేరకు వారు కోరినట్టుగా బుద్ధ విహార్ షెడ్డు నిర్మాణం, హనుమాన్ మందిరం షెడ్డు,పోచమ్మ మందిర ఆలయ అభివృద్ధి, పలు జజ రోడ్లు, నాళాల పనులు విడతల వారిగా త్వరలో చేపడతాం అన్నారు.గతంలో దీ=నా ప్రభుత్వం10 ఏళ్లు రేషన్ కార్డులు ఇవ్వకుండా, డబుల్ బెడ్రూం ,దళితులకు



భూములు, దళిత బంధు ఇవ్వకుండా మాయ మాటలు చెప్పిన వారికి రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. మోదీ ప్రభుత్వం కూడా, కాలా దన్ వాపస్, గారిబోకు 15 లాక్, అనేక తప్పుడు వాగ్దానాల ద్వారా గద్దెనెక్కరన్నారు. ఈ రెండు పార్టీ లను నమ్మితే మన గోస పడతాం అన్నారు. రానున్న రోజుల్లో పీుఋజ్భౌుజ ఎన్నికలలో మన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకొని మన గ్రామాలను మనమే అభివృద్ధి చేసుకుందాం అన్నారు. ఈ కార్య క్రమంలో గుడిహత్నూర్ సర్పంచ్ ఆడే శీల, నియోజక వర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, సద్దాం, లాందాడే నాగ్నాథ్, సీనియర్ నాయకులు అంకతి, రవి, ససానే మాధవ్, గణేష్ ముండే, క్రాంతి, అర్షద్,శ్రీకర్ గౌడ్, ఆడే జైపాల్,సమీర్,భివాజీ,ఖాజా బాయ్ ,భలేరావు లక్ష్మణ్, ముత్నూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, శ్రీధర్ మహారాజ్, రవి ముండే, మాధవ్ , సారంగపాణి పలువురు ప్రముఖులు,కార్యకర్తలు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల పోస్టర్లు ఆవిష్కరించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### బంజారా, లంబాడ సోదరులందరూ తరలిరావాలని పిలుపు



సేవలాల్ జయంతి పోస్టల్ ఆవిష్కరిస్తున్న చేస్తున్న శాసనసభ్యులు అనిల్ జాదవ్

అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ ఈనెల 18వ తేదీన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో అధికారికంగా నిర్వహిస్తున్న శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి ఉత్సవాల పోస్టర్లను ఈరోజు నెరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గారు మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామాల బంజారా, లాంబాడా సోదరులు ఉత్సవాలకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమాజం యొక్క కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాథోడ్ భీంరావ్ నాయక్, గౌరవ అధ్యక్షులు జాదవ్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి వినాయక్ రావ్ చౌహన్ తదితరులు పాల్గొన్నారు.

# ముున్సిపల్ ఓట్ల లెక్కింపుకు పకడ్బందీ ఏర్పాట్లు నిబంధనలు కచ్చితంగా పాటించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా









కౌంటింగ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల సాధారణ పరిశీలికులు హనుమంత్ నాయక్ దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు లోబడి నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ టీటీడీసీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ హాళ్లు, భద్రతా ఏర్పాట్లు, బారికేడింగ్, వెలుతురు తదితర సదుపాయాలను స్వయంగా తనిఖీ చేసి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శుక్రవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. మొత్తం నాలుగు హాళ్లలో కౌంటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 49 వార్డులకు గాను ఒక్కో వార్డుకు ఒక్కో టేబుల్ చొప్పున 49 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియలో సుమారు 180 మంది శిక్షణ పొందిన సిబ్బంది విధులు నిర్వహించనున్నారని తెలిపారు. ఒక్కో టేబుల్ వద్ద మూడు రౌండ్ల లెక్కింపు ఉండగా, ప్రతి రౌండ్‌కు సుమారు 90 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, వేగం కంటే ఖచ్చితత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్నం 2 గంటలలోపు ఫలితాలు వెల్లడయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్ మాట్లాడుతూ, పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించినట్లే కౌంటింగ్‌ను కూడా క్రమశిక్షణతో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద సిబ్బంది, ఏజెంట్లకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అధికారులు రాథోడ్ రవీందర్, రమేష్, ఫణిందర్ తదితర రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముున్సిపల్ ఓట్ల లెక్కింపుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

పార్కింగ్ బారికేడింగ్‌తో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు

కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత - అనుమతి ఉన్నవారికే ప్రవేశం

అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ రేపు నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్కింగ్, బారికేడింగ్, ప్రతినిధులు,అధికారులు, సిబ్బంది ప్రవేశంపై పాటించాల్సిన విధి విధానాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ కేంద్ర పరిసరాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేసి, అనుమతి పత్రాలు ఉన్న సిబ్బంది మరియు ప్రతినిధులను మాత్రమే లోపలికి అనుమతిస్తామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు, గస్తీ బలగాల మోహరింపు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు, భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, నిర్మల్ ఏఎస్పీ సాయి కిరణ్ ఐపీఎస్, ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐ లు ఉన్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు.

కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచల భద్రత.

టిటిడిసి ప్రాంగణం నందు 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు

విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవు.

విజయం తర్వాత టపాకాయలు పేల్చరాదు.

ఏజెంట్లకు మరియు వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థులకు సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇంకు పెన్నులకు అనుమతి లేదు.

సంబంధిత అధికారుల అనుమతులు తీసుకున్న తర్వాత నిర్దేశించిన మాత్రమే విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలి.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో ప్రతిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలియజేశారు. కౌంటింగ్ కేంద్రం పూర్తిగా మూడంచల భద్రతతో పటిష్టమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమం స్థానిక టిటిడిసి ప్రాంగణం నందు జరగనుండగా ప్రాంగణం పరిసర ప్రాంతాలలో 163బిఎన్ఎస్ఎస్ ( 144 సెక్షన్) అమలులో ఉందని, ప్రజలు గుంపులు గుంపులుగా తిరగడానికి అనుమతులు లేవని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికలలో విజయం పొందిన నాయకులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి అనుమతులు లేవని తెలిపారు. మరుసటి రోజు సంబంధిత అధికారుల అనుమతులు తీసుకొని నిర్దేశించిన రోజు మాత్రమే విజయోత్సవ ర్యాలీలను నిర్వహించాలని తెలిపారు. టపాకాయలు పేల్చడానికి, డీజే సౌండ్ లకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రజలందరూ నియమ నిబంధనలు పాటించి, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యే విధంగా సహకరించాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా " ఐ లవ్ ఆదిలాబాద్ నుండి మావల పోలీస్ స్టేషన్ వరకు" ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నట్టు, రేపు ఉదయం నుండి ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు ఆంక్షలు కొనసాగుతాయని ప్రజలు పట్టణంలోని అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రాలలోనికి వచ్చే ఏజెంట్లకు గానీ అభ్యర్థులకు గానీ సెల్ఫోన్లను, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతులు లేవని, అదేవిధంగా ఇంకు పెన్నులు లాంటి వాటిని తీసుకురావద్దని సూచించారు.



# కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం



కార్మిక లోకం కేంద్ర ప్రభుత్వం పై విజృంభన

హైదరాబాద్ అమృత్ తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె. సుబ్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నేడు (ఫిబ్రవరి 12) జాతీయ సార్వత్రిక సమ్మె జరుగుతున్నది. బి.ఎం.ఎస్ మినహా మిగిలిన కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. వ్యవసాయ కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా వంటి ప్రజా సంఘాలు దీనిని బలపరుస్తున్నాయి.

వివిధ రకాల ప్రభుత్వ స్కీములలో దేశవ్యాప్తంగా దాదాపు కోటి మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో మెజారిటీ (80 శాతం) మహిళా కార్మికులు. ఈ స్కీములు అమలు చేయడం వల్ల సమాజంలో కొంతమేరకు పేదరికం తగ్గటంతో పాటు, మాతా శిశు మరణాల రేటు తగ్గింది. పిల్లల్ని బడికి అలవాటు చేయడంలో మెరుగుదల ఉంది. ఇలాంటి కీలక పథకాల్లో పని చేస్తున్న స్కీమ్ వర్కర్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి.

కార్మికులుగా గుర్తించాలి

అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, వి.ఓ.ఎ, ఆర్.పి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ రంగాల్లో, వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్, అర్బన్ హెల్త్ సెక్రటరీలు, ఎ.ఎన్.ఎం, స్టాఫ్ నర్సులు ఎం.ఎల్.హెచ్.పి, మెంటల్ హెల్త్ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్నారు. వీరికి అదనంగా రాష్ట్రంలో ఎ.పి.శాక్స్, ఆయుష్, 104, 108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఆరోగ్య మిత్ర, సమగ్ర శిక్ష, కస్తూర్బా, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఉపాధి పథకం, ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు ఆర్పీలు, ఆర్.డబ్ల్యు.ఎస్, సత్యసాయి వాటర్ వర్క్స్, 1962 వెటర్నరీ సర్వీస్ తదితర ప్రభుత్వ పథకాల్లో అనేక సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్నారు.

దేశంలోనూ, రాష్ట్రంలోనూ మానవ అభివృద్ధి సూచికలలో పురోగతి సాధించామంటే వీరి కృషి ఫలితమే. కానీ ప్రభుత్వాలు తమ ఘనతగా చెప్పుకుంటూ అసలు అభివృద్ధి సాధించిన స్కీమ్ వర్కర్లను నిర్లక్ష్యం చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ స్కీముల్లో పని చేసే వారిని కనీసం కార్మికులుగా గుర్తించలేదు. 2013లో ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐ.ఎల్.సి) చేసిన సిఫారసుల ప్రకారం వీరికి కనీస వేతనాలు, గ్రాట్యూటీ, పి.ఎఫ్ ఇ.ఎస్.ఐ తదితర సామాజిక భద్రత సౌకర్యాలు అమలు చేయాలి.

కేంద్రం దూకుడు -- కార్మికులకు ప్రమాదం

బిజెపి మూడవసారి అధికారంలోకి వచ్చిన తరువాత చాలా దూకుడుగా 2025 నవంబర్ 21న లేబర్ కోడ్ల అమలుకు నోటిఫికేషన్లు జారీచేసింది. 2026 ఏప్రిల్ నుండి అమలుకు సిద్ధపడుతున్నారు. మన రాష్ట్రంలో ముందుగానే పని గంటలు 8 నుండి 10 గంటలకు పెంచాలని, మహిళలకు భద్రత కల్పించి రాత్రి పూట పని చేయవచ్చని అసంబ్లీలో తీర్మానం చేశారు. లేబర్ కోడ్లు అమలైతే సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కులు కోల్పోయే ప్రమాదం ఉంది. ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ వలన పర్మినెంట్ అనే మాటను మర్చిపోవాల్సి వస్తుంది. అంతేగాక, వేతనాల కోడ్‌లో కనీస వేతనాలు ప్రతిపాదన చాలా ప్రమాదకరంగా ఉంది. మార్కెట్‌లో ఎంత తక్కువ వేతనానికి పని చేయటానికి కార్మికుడు సిద్ధపడతాడో దానిని ఫ్లోర్ వేజ్ అంటారు. జాతీయ ఫ్లోర్ వేజ్‌ని రోజుకి 178 రూపాయలుగా నిర్ణయించారు. ఇది కార్మికులను అవమాన పరచడం తప్ప మరొకటి కాదు. అనేక రాష్ట్రాలలో అప్పటికి కనీస వేతనం కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ.178 కంటే చాలా ఎక్కువగా ఉంది. ఈ విధానం గతంలో త్రైపాక్షిక కమిటి కనీస చేసిన వేతన నిర్ణయానికి విరుద్ధమైనది. ఐ.ఎల్.సి సిఫార్సు ప్రకారం కనీసం రూ.26,000 ఇవ్వాలి. గుజరాత్ హైకోర్టు పేర్కొన్నట్టు అంగన్వాడీ వర్కర్‌కు రూ.24,800, హెల్పర్‌కు రూ.20,300 కనీస వేతనం ఇవ్వాలి.

కోర్టు తీర్పులనూ పట్టించుకోరా!

ఐ.సి.డి.ఎస్ ప్రారంభించి 50 సంవత్సరాలు, ఎం.డి.ఎం ప్రారంభించి 30 సంవత్సరాలు, ఎన్.హెచ్.ఎం ప్రారంభించి 20 సంవత్సరాలైనా నేటికీ ఈ స్కీమ్‌లలో పని చేసే వారిని కనీసం కార్మికులుగా గుర్తించలేదు. ఎటువంటి చట్టబద్ధ సౌకర్యాలు అమలుచేయటంలేదు. 2022లో సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా ఉన్న 26 లక్షల మంది అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ చట్టాన్ని అమలు చేయాలని తీర్పు ఇచ్చినా నేటికీ అమలు కావడంలేదు. మన రాష్ట్రంలో 42 రోజుల చారిత్రాత్మక సమ్మె తరువాత కొన్ని జీఓలు సాధించుకున్నాం. 2024 మార్చిలో అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ అమలుచేస్తామని జీఓ.నెం.8 ఇచ్చినా నేటికీ మార్గదర్శకాలు రూపొందించలేదు. 2025 డిసెంబరు నుండి చాలామంది రిటైరు అవుతున్నారు. ఎంత ఇస్తారనేది స్పష్టత లేదు. సర్వీసులో ఉండి చనిపోయినా ఎటువంటి బెనిఫిట్లు లేవు. వివిధ రకాల స్కీముల్లో పనిచేసే వారికి వేతనాలు 3 వేల నుండి 15 వేల లోపు మాత్రమే ఇస్తున్నారు. కాని స్కీమ్ వర్కర్లు అందరూ ప్రభుత్వ ఉద్యోగులనే తప్పుడు నెపంతో సంక్షేమ పథకాలను అమలు చేయడంలేదు. ఆశా వర్కర్లు సమరశీల పోరాటాలు చేసి కొన్ని సాధించుకున్నా కనీస వేతనాలు అమలు కావటంలేదు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చెయ్యడం వలన పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఈ పథకంలో పని చేస్తున్న కార్మికులకు కేవలం నెలకు 3 వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. అది కూడా సంవత్సరంలో 10 నెలలు మాత్రమే ఇస్తున్నారు. 11 సంవత్సరాల నుండి వేతనాలు పెరగలేదు. ఈ పథకాన్ని అక్షయ పాత్ర, ఇస్కాన్ తదితర ప్రైవేటు స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తున్నారు. నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉంటున్నాయి.

వివిధ స్కీముల్లో సంవత్సరాల తరబడి పని చేసినా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించలేదు. ప్రభుత్వ శాఖల్లో రెగ్యులర్ ఖాళీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చెయ్యకుండా వివక్షత చూపుతున్నారు. కేంద్ర, ప్రభుత్వ పథకాల్లో ఉద్యోగులకు హ్యూమన్ రిసోర్స్ పాలసీ అమలు చెయ్యాలన్న నిబంధనలను రూపొందించారు. కానీ మన రాష్ట్రంలో ఉపాధి, వెలుగు పథకాల్లో తప్ప ఏ ఇతర పథకాల్లోనూ హ్యూమన్ రిసోర్స్ పాలసీని రూపొందించలేదు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న వారికి మినహా పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ అమలు కావడంలేదు. రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్ సౌకర్యాలు లేవు. చనిపోతే కారుణ్య నియామకాలు లేవు. ఆరోగ్య బీమా లేదు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంలేదు. కొన్ని డిపార్ట్‌మెంట్లలోనే రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచారు. ఇంకా చాలా డిపార్ట్‌మెంట్లలో రిటైర్మెంట్ వయస్సు పెంచలేదు. ఈ లేబర్ కోడ్లు అమలైతే ఈ సౌకర్యాలన్నీ అమలు చేయాలని అడిగే హక్కును కోల్పోయే ప్రమాదం ఉంది.

పేద ప్రజలకు ఉపయోగపడుతున్న వివిధ రకాల ప్రభుత్వ స్కీములకు సరిపడా బడ్జెట్ కేటాయించలేదు. ఐ.సి.డి.ఎస్ కు రూ.23,100 కోట్లు, ఉపాధి హామీ పథకానికి రూ.95 వేల కోట్లు కేటాయించారు. ఇది ఏ మాత్రం సరిపోదు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా 100 రోజుల పనిని 125 రోజులకు పెంచాలంటే కనీసం రూ.3 లక్షల కోట్ల కేటాయించాలి. 2026 మార్చిలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని ప్రకటించినా బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. ఐ.సి.డి.ఎస్ లో దాదాపు 8 కోట్ల మంది పిల్లలు, 2 కోట్ల మంది గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న అనుబంధ పోషకాహారానికి నయా పైసా పెంచలేదు. ఈ బడ్జెట్‌లో రూ.1140 కోట్లు పెరిగినట్లు చూపించినా...

ఇవి ఏమాత్రం సరిపోవు. ఈ కాలంలో డిజిటలైజేషన్, ఫేస్ రికగ్నిషన్ అమలు చెయ్యటానికి మొబైల్ ఫోన్లకు ఎటువంటి కేటాయింపులు లేవు.

స్కీమ్‌లకు కేటాయింపులు పెంచాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా పేరు మార్చకుండా యథావిధిగా కొనసాగించి నిధులు పెంచాలని, విద్యుత్ సవరణ చట్టం, విత్తన సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ... నేటి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో స్కీమ్ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేద్దాం.





కేఎల్ రాములు అమృత్ తెలంగాణ తెలుగు దినపత్రిక నిర్మల్ నిజాంబాద్ బ్యూరో ఇంచార్జ్

# రైతులపై ఎలుగుబంటి దాడి

ఒకరు మృతి, ఎనిమిది మందికి గాయాలు

సరిహద్దు ప్రాంతాల్లోనీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీఐ గురుస్వామి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకా దయాల్ దన్నూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు తేది:10.02.2026 రాత్రి 10.00 నుంచి 11.00 సమయంలో మొక్క జొన్న పంటకు నీరు అందించేందుకు పొలానికి వెళ్లారు. అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న సర్వే నం.89 వ్యవసాయ భూమిలో ఎలుగుబంటి దత్త బలిరాం జాదవ్ వయస్సు.55 గ్రామం. దయాల్ దన్నూర్ పై దాడి చేసింది. గ్రామానికి చెందిన మరో 8 మంది రైతును కాపాడటానికి వెళ్ళిన సమయంలో అందరి పై దాడి చేసింది. నలుగురు తీవ్రంగా గాయపడగా వారిలో ముగ్గురిని నాందేడ్ లోని ప్రభుత్వ ఆసుపత్రి లో, ఒకరిని సంబాజీ నగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బోథ్ మండలంలోని సరిహద్దు ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీ ప్రాంతానికి వెళ్ళవద్దని సూచిస్తున్నాం. అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న గ్రామాల ప్రజలు ఏదైనా ప్రమాదం అనిపిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలి.



# వరుస దొంగతనాలకు పాల్పడిన గజదొంగ అరెస్టు

**11.4 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం**
**ఒక స్కూటీ రికవరీ**
**ఉట్నూర్ మండలంలో ఏడు కేసులు ఛేదించిన పోలీసులు**
**మంచిర్యాల స్కూటీ దొంగతనంలోనూ నిందితుడి ప్రమేయం వెలుగు**
**సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేసిన జిల్లా ఎస్పీ.**
**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ న్యూస్ స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరం నందు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ వివరాలను వెల్లడిస్తూ, ఉట్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా జరుగుతున్న రాత్రి దొంగతనాల 7 కేసులను ఛేదిస్తూ పోలీసులు గజదొంగను అరెస్టు చేసినట్లు తెలిపారు.

నిందితుడు టేకం రామారావు ఏ తుకారం (40), తండ్రి ఆనందరావు, నాగాపూర్ గ్రామం, ధంతనపల్లి గ్రామపంచాయితీ, ఉట్నూర్ మండలానికి చెందినవాడని తెలిపారు. ఇప్పటివరకు నిందితుడిపై మొత్తం 36 కేసులు నమోదై ఉండగా, కరీంనగర్ మరియు సిద్దిపేట్ ప్రాంతాల్లో దొంగతనాలు చేసినందుకు గతంలో రెండు సంవత్సరాల జైలు శిక్ష అనుభవించి జనవరి నెల 6న విడుదలైన అనంతరం మళ్లీ ఉట్నూర్ మండలంలో వరుసగా ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు.

ఉట్నూర్ మండల పరిధిలో క్రైమ్ నెంబర్లు 12/26, 15/26, 16/26, 17/26, 21/26, 29/26, 31/26గా మొత్తం ఏడు రాత్రి దొంగతన కేసులు నమోదయ్యాయి. గత నెల 6న విడుదలైన క్షణం నుండి మంచిర్యాలలో స్కూటీ దొంగతనం చేసి ఉట్నూరుకు వచ్చి, ఊరు శివారులో పాడుబడ్డ ఇళ్లలో, నిర్మాణం జరుగుతున్న ఇళ్లలో నివాసం ఉంటూ, రాత్రి సమయాలలో దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఈరోజు ఉదయం దొంగిలించిన బంగారం, వెండి సామాగ్రితో మంచిర్యాల వైపు పారిపోతుండగా కొత్తగూడ ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండి నిందితుడిని పట్టుకున్నట్లు ఎస్పీ వివరించారు. ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులపై పూర్తి వివరాలను తెలియజేస్తూ జిల్లా ఎస్పీ పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు.

స్వాధీనం చేసుకున్న ఆభరణాలు:

3 వెండి కడియాలు -- 7 తులాలు
1 బంగారు హారం -- 5 తులాలు
6 బంగారు ఉంగరాలు -- 2.4 తులాలు
2 జతల బంగారు కమ్మలు -- 1 తులం
1 జత బంగారు మాటీలు -- 0.5 తులం
1 బంగారు చైన్ -- 2.5 తులాలు
2 జతల వెండి పట్టీలు -- 13 తులాలు



మీడియాతో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

మొత్తం 11.4 తులాల బంగారం మరియు 20 తులాల వెండి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా కృషి చేయాలని, గ్రామాలలో పట్టణాలలో వీధులలో ప్రత్యేకంగా సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్న సమయంలో దొంగతనాలు జరగకుండా ఉంటాయని, ఒకవేళ జరిగినప్పుడు వాటిని చేదించడంలో ఉపయోగపడతాయని తెలిపారు. పట్టణంలో జిల్లా పోలీస్ శాఖ వివిధ రకాల స్వచ్ఛంద సంస్థల ద్వారా సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తుందని తెలిపారు.

దొంగతనం జరిగిన ప్రదేశంలో క్లూస్ టీం, (డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ యూనిట్) వచ్చేంతవరకు సంఘటన స్థలం యజమానులు, కుటుంబ సభ్యులు, మిత్రులు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. జిల్లాలో పటిష్టమైన క్లూస్ టీం వ్యవస్థ విధులను నిర్వర్తిస్తుందని తెలిపారు. దొంగతనాలను అరికట్టడానికి ఊర్లకు వెళ్లే సమయంలో యజమానులు ప్రజలు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్ ని సంప్రదించి తమ వివరాలను పొందుపరచాలని రాత్రి పెట్రోలింగ్ సమయాల్లో పోలీసులు సంచరిస్తూ అప్రమత్తతో ఉంటారని తెలిపారు. పెద్ద పెద్ద తాళాలు బయటకు కనిపించే విధంగా వేసి, దొంగలకు అవకాశాలు ఇవ్వవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్, ఎస్సై గుంపుల విజయ్ మరియు పోలీస్ సిబ్బంది ఆర్ శ్యామ్ రావు, బి నరేష్, ఐ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెకు కామారెడ్డిలో కదిలిన కార్మిక లోకం




కామారెడ్డి :అమృత్ తెలంగాణ: పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకోవాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన సార్వత్రిక సమ్మెకు మద్దతుగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులు పాల్గొని భారీ ర్యాలీ, సభ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టి అనంతరం మున్సిపల్ ఆఫీస్ ముందు సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కందరపు రాజనర్సు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ హాజరయ్యారు. సిఐటి యు జిల్లా కన్వీనర్ అరుణ్, సీనియర్ నాయకుడు కే. చంద్రశేఖర్ తదితరులు పాల్గొని మాట్లాడారు. వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం -- 2025, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసీలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి వంటి నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని కోరారు.

లేబర్ కోడ్ల అమలుతో కార్మికుల ఉద్యోగ భద్రత దెబ్బతింటుందని, హైర్ అండ్ ఫైర్ విధానం పెరిగే ప్రమాదం ఉందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ వంటి సామాజిక భద్రతా హక్కులు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు, సమ్మె హక్కుపై కూడా ప్రభావం పడుతుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఈ సమ్మెలో సుమారు 3,000 మంది కార్మికులు పాల్గొన్నారని నాయకులు తెలిపారు. ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులు, స్వచ్ఛ కార్మికులు, స్కీం వర్కర్లు సహా వివిధ విభాగాల ఉద్యోగులు ఈ కార్యక్రమంలో భాగమయ్యారు. కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకునే వరకు ఐక్యంగా పోరాటాలు కొనసాగించాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు.

# మహా శివరాత్రికి ప్రత్యేక బస్సులు

హైదరాబాద్: అమృత్ తెలంగాణ:మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు రద్దీ నేపథ్యంలో టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2243 ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి కాగా, ఈనెల 14 నుంచి 16వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులను సంస్థ నడపనుంది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్ టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14నుంచి 16తేది వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15 వతేది నుంచి 17 తేది వరకు(మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డ్ లను సంస్థ ఏర్పాటు చేస్తుంది. టికెట్ల బుకింగ్ మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000,040-234500332లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# అలాంటి వారికే అవకాశాలు ఎక్కువంటున్న నిధి అగర్వాల్..!




స్లో అండ్ స్టడీ విన్స్ ద రేస్ అనే ఫార్ములాతో వస్తున్న అవకాశాలను చేసుకుంటూ వెళ్తుంది ఉత్తరాధి భామ నిధి అగర్వాల్. అక్కినేని బ్రదర్స్ నాగ చైతన్య అఖిల్ ఇద్దరితో సినిమాలు చేసిన నిధి అగర్వాల్ ఆ సినిమాలు నిరాశపరచడంతో కెరియర్ రిస్క్ లో పడ్డది. ఆ టైం లోనే పూరీ జగన్నాథ్ ఇస్మార్ట్ శంకర్ అమ్మడికి మంచి బ్రేక్ ఇచ్చింది. ఆ సినిమాలో మరో హీరోయిన్ నభా నటేష్ ఉన్నా కూడా నిధి గ్లామర్ షోకి ఎక్కువ మార్కులే పడ్డాయి. ఆ సినిమాతో కెరియర్ జోష్ వచ్చినా ఆ తర్వాత మళ్లీ యదావిధిగానే ఆఫర్లు లేకుండాపోయాయి. ఇక ఖాళీగా ఎందుకని గల్లా అశోక్ తొలిపరిచయంగా చేసిన హీరో సినిమాలో నటించింది నిధి అగర్వాల్. ఈ గ్యాప్ లో కోలీవుడ్ షిఫ్ట్ అయిన అమ్మడు అక్కడ జయం రవి శింబు లాంటి స్టార్ హీరోలతో నటించి క్రేజ్ తెచ్చుకుంది. తెలుగులో కన్నా తమిళంలో ఎక్కువ పాపులర్ అయ్యింది నిధి అగర్వాల్. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో తన సినీ జర్నీపై స్పందిస్తూ.. సినిమాల్లో 20 శాతం నటనకు 80 శాతం అందానికి ప్రాముఖ్యత ఉంటుందని చెప్పింది. కేవలం టాలెంట్ ఉంటేనే ఛాన్సులు వస్తాయంటే తాను ఒప్పుకోను..

# సెకండ్ ఇన్నింగ్స్ కి రెడీ అంటున్న ముద్దుగుమ్మ..!

బెంగళూరు భామ ప్రణీత నటించిన తక్కువ సినిమాలతోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. స్టార్ హీరోయిన్ క్రేజ్ తెచ్చుకోకపోయినా సరే ప్రణీత అంటే ఇష్టపడే ప్రేక్షకులు కూడా ఉన్నారని చెప్పొచ్చు. కన్నడంలో పోకిరి రీమేక్ సినిమాతో తెరంగేట్రం చేసిన ప్రణీత తెలుగులో కూడా సినిమాలు చేసింది. యువ హీరోలు తనీష్ రామ్ సినిమాల్లో నటించిన ప్రణీత సుభాష్ పవన్ కళ్యాణ్ అత్తారింటికి దారేది సినిమాలో కూడా నటించి మెప్పించింది. ఓ పక్క సినిమాలు చేస్తూనే సడెన్ గా అమ్మడు పెళ్లి చేసుకుని షాక్ ఇచ్చింది. బిజినెస్ మెన్ నితిన్ రాజ్ తో ప్రణీత పెళ్లి అందరిని సర్ ప్రైజ్ చేసింది. ప్రణీతకి అప్పుడే పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేకపోయినా నితిన్ రాజ్ పెళ్లి ప్రపోజల్ తెచ్చే సరికి ఆవెం కాదనలేకపోయిందట. ఈ జూన్ లో ఒక బేబీకి కూడా జన్మనిచ్చింది ప్రణీత. ఆఫ్టర్ మ్యారేజ్ సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చిన ప్రణీత కరోనా లాక్ డౌన్ టైం లో తన సోషల్ యాక్టివిటీస్ తో ప్రేక్షకులను అలరించింది. తనవంతు సాయంగా కొవిడ్ లాక్ డౌన్ టైం లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసింది ప్రణీత. ఇక ఇప్పుడు ప్రణీత మళ్లీ సినిమాలు చేసేందుకు రెడీ అంటుంది. సెకండ్ ఇన్నింగ్స్ గురించి మాట్లాడుతూ




ఒక మదర్ గా నా కర్తవ్యాన్ని పూర్తి చేశాను.. ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాను అంటూ చెప్పింది. పాపని పుట్టగానే నీ కర్తవ్యం పూర్తయిందా అంటూ ప్రణీత మీద నెటిజెన్లు కామెంట్ చేస్తున్నారు. అయితే భర్త ఎంత బిజినెస్ మెన్ అయినా కూడా తనకంటూ ఒక జాబ్ రోల్ ఉండాలని మళ్లీ తనకు ఇంత క్రేజ్ తెచ్చిన సినిమాల పైనే ఫోకస్ చేయాలని చూస్తుంది ప్రణీత. అందుకే తన ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అలరిస్తుంది. ఈమధ్యనే మళ్లీ తన హాట్ ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది ప్రణీత.

# ఎన్టీఆరా.. మజాకా.. జపాన్ భాషలో రప్ఫాడించాడు..!

మెగా పవర్ స్టార్ రాంచరణ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ కాంబినేషన్లో తెరకెక్కిన మూవీ 'ఆర్ఆర్ఆర్ (రౌద్రం రణం రుధిరం). మెగా నందమూరి అభిమానులతోపాటు యావత్ ఇండియన్ ప్రేక్షకులను 'ఆర్ఆర్ఆర్' మూవీ ఓ రేంజులో ఆకట్టుకుంది. విడుదలకు ముందు నుంచి ఈ సినిమాపై భారీ అంచనాలను పెంచిన రాజమౌళి అందుకు తగ్గట్టుగానే 'ఆర్ఆర్ఆర్'ను తెరకెక్కించింది.'అల్లూరి'గా రాంచరణ్ కొమురంభీంగా రాంచరణ్ సీతగా అలియాభట్ బ్రిటిష్ ప్రిన్సెస్ గా ఓలివియాలు నటించారు. బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ వెటరన్ బ్యూటీ శ్రియ శరణ్ సముద్రఖని తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను నెలకొల్పి నిర్మాతలకు కాసులవర్షం కురిపించింది. తాజాగా ఈ మూవీని జపాన్ భాషలోనూ విడుదల చేస్తున్నారు. ఈక్రమంలోనే 'ఆర్ఆర్ఆర్' బృందం జపాన్ రాజధాని టోక్యోలో పర్యటిస్తోంది. ఉదయం నుంచే రాంచరణ్ ఉపాసన ఎన్టీఆర్ ప్రణతి రాజమౌళి రమ తదితరులు 'ఆర్ఆర్ఆర్' ప్రమోషన్స్ ను ఓ రేంజులో చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు వీడియోలు నెట్టింట్లో వైరల్ గా మారాయి. కొద్దిసేపటి క్రితమే 'ఆర్ఆర్ఆర్' బృందం టోక్యో వీధుల్లో 'దోస్తీ' పాటకు సందడి చేస్తూ రోడ్డును దాటారు. ఈ వీడియోను ఎన్టీఆర్ రాంచరణ్ పోస్టు చేయగా వైరల్ అయింది. అయితే తాజాగా ఎన్టీఆర్ అభిమానులు మరో వీడియోను నెట్టింట్లో వైరల్ చేస్తున్నారు. ఈ మూవీ ప్రమోషన్స్ లో భాగంగా టోక్యోలో 'ఆర్ఆర్ఆర్' టీం మీడియా ప్రెస్ మీట్ నిర్వహించింది. అయితే ఎన్టీఆర్ ఎవరూ ఊహించని విధంగా జపాన్ భాషలో మాట్లాడి అక్కడి వారిని ఆకట్టుకున్నాడు. జపాన్ భాషలో అభిమానులను పలుకరించడంతోపాటు వారిని ఉత్తేజపరిచాడు. సుమారు 70 సెకన్ల నిడివితో ఉన్న ఈ వీడియో ఎన్టీఆర్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# బ్యూటీ విత్ టాలెంట్.. లైగర్ భామ షైనింగ్..



బాలీవుడ్ అందాల భామ అనన్యా పాండే ఇటీవలే రౌడీ బోయ్ విజయ్ దేవరకొండతో లైగర్ సినిమాలో నటించింది. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఆ సినిమా పాన్ ఇండియా రిలీజైంది. సినిమా అంచనాలకు తగినట్టుగా లేకపోవడంతో బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. ఆ సినిమాపై ఎన్నో ఆశలు పెట్టుకున్న అనన్యా పాండే కూడా సినిమా రిజల్ట్ తో డీలా పడ్డది. లైగర్ తో సౌత్ లో సత్తా చాటాలని అనుకున్న అమ్మడికి సినిమా ఫెయిల్యూర్ షాక్ ఇచ్చింది. అంతేకాదు లైగర్ హిట్ కొడితే తెలుగులో వరుస సినిమాలు చేయాలని అనుకున్న ఆలోచనలకు బ్రేక్ పడేలా చేసింది. స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2 సినిమాతో సిల్వర్ స్క్రీన్ కి ఎంట్రీ ఇచ్చిన అనన్యా పాండే చేసిన మూడు నాలుగు సినిమాలకే బ్యూటీ విత్ టాలెంట్ అనిపించుకుంది. లైగర్ సూపర్ హిట్ అయితే ఎలా ఉండేదో కానీ ఆ సినిమా ఫ్లాప్ అవడం అమ్మడికి తెలుగులో మరో ఛాన్స్ రాకుండా చేసింది. ప్రస్తుతం బాలీవుడ్ లో కో గయే హమ్ కహన్ డ్రీం గర్ల్ 2 సినిమాల్లో నటిస్తుంది అనన్యా పాండే. సినిమాలే కాదు వెబ్ సీరీస్ లకు అమ్మడు ఓకే అనేస్తుంది. గెహ్రాయాన్ వెబ్ సీరీస్ లో దీపికా పదుకొనేకి పోటీగా అనన్యా పాండే నటనతోనూ అందంతోనూ మెప్పించింది. సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో కూడా ఫ్యాన్స్ ని ఆకట్టుకుంటుంది

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com